REGD. NO. A. 18

విడి ప్రతి 0-20 న. పై

శుక్రవారం 10-3-61

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 33 * సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి * సంచిక 10

## హైదరాబాదు లేఖ

# పట్టాభిరామారావు రాజీనామా-

## పట్టుబట్టడం సహేతుకమని భావించిన ప్రాంతీయ మంత్రులు, అది నెరవేరనప్పుడు, తాము వైదొలగి వుండవలసింది

ఆంధ్రకాంగ్రెసు నాయకుల గమన మెటు? దేవుడికే తెలియాలి! ఇదే మరొక ప్రజాస్వామిక దేశమైవుంటే, మంత్రివర్గం రాజీనామా యిచ్చివుండేది. ఇద్దరు మంత్రుల చర్యలను విమర్శిస్తూ వున్నత న్యాయస్థానం రెండు తీర్పుల నిచ్చింది. వీటికి తలాగ్గడం చట్టబద్ధమైన ప్రభుత్వ విధానంలో విశ్వాసాన్ని ప్రకటించినట్లవుతుంది.

న్యాయస్థానం పైన న్యాయమూర్తుల తీర్పుపైన విశ్వాసాన్ని ప్రకటిస్తున్న విజయనగరం మహారాజా వారు బ్రహ్మానందరెడ్డి గారు పట్టాభిరామారావు గారి రాజీనామాకు గట్టిగా పట్టుబట్టడం సహేతుకమేనని భావించినా, పట్టాభిరామారావు గారు రాజీనామా పెట్టకపోయినా, తాము తమ పదవులను వదులుకోనిమని చెప్పడం హేతుబద్ధం కాదని చెప్పాలి. "మేమేమి తప్పుచేశాము రాజీనామా పెట్టడానికి? రాజీనామా పెట్టామని మేమనలేదే" అని ఢిల్లీనుంచి తిరిగివచ్చిన అనంతరం విజయనగరం గజపతిరాజు గారు చెప్పారు. ఒక వున్నత న్యాయస్థానపు తీవ్రమైన ఖండనకు గురి అయిన మంత్రిని పదవినుంచి తొలగించమని ముఖ్యమంత్రిని కోరినా, ఆయన సమ్మతించకపోతే, అలా కోరిన మంత్రులు తమ పదవులనుంచి వైదొలగి, పార్టీలో కాని మరొక రంగం ద్వారా కాని దురాచారానికి విరుద్ధంగా ఆందోళన చేయాలి. అలా చేయక వీరు ఢిల్లీ పరిగెత్తారు. పంజాబు మొదలైన రాష్ట్రాలలో హైకోర్టులు ఇంకా ఘోరంగా మంత్రుల ప్రవర్తనలను విమర్శిస్తూ తీర్పులనిచ్చినప్పటికీ, ఏమీచేయని, చేయలేని కాంగ్రెసు అగ్రనాయకులు ఇప్పుడు మాత్రం ఏం చేస్తారు?

బడ్జెటుపై శాసన సభలో సాధారణచర్చ ప్రారంభమైన రోజునుంచి, ఏ. సి. సుబ్బారెడ్డిగారు ఏం చేస్తారు, వారెప్పుడు ప్రసంగిస్తారు అని చాలామంది నిరీక్షించారు. చివరికి ఆర్థికమంత్రి సమాధానం చెప్పేముందు, అయిదవరోజున ఆయన లేచి నిలుచున్నారు. రాజీనామాను అంగీకరించక పట్టాభిరామారావుగారిని అపఖ్యాతిపాలు చేయడం ముఖ్యమంత్రికి తగదని ఆయన చెప్పారు. రవాణా మంత్రి, సహకార మంత్రిపై హైకోర్టు తీర్పు ఆ విధంగా ఇచ్చిన అనంతరం ఏ మొహం పెట్టుకొని వచ్చే ప్రజలదగ్గరకు వెళ్లి వోట్లు అడుగుతామని ఆయన ప్రశ్నించారు. ఎవరో ఒకరు ధైర్యంచేసి తగిన త్యాగానికి పూనుకొనకపోతే రాష్ట్రానికి భవిష్యత్తు లేదని సూచించారు. అంటే, వారు చేస్తున్న పని భావ్యత గుర్తెరిగే చేస్తున్నారన్నమాట. అయితే ముఖ్యమంత్రి ఏ కారణంచేతనైనా రవాణామంత్రి రాజీనామాను అంగీకరించకపోతే, ఇతర మంత్రులను, ముఖ్యంగా తెల వర్గానికి చెందిన మంత్రులను మంత్రివర్గంనుంచి వైదొలగమనికూడా ఆయన సలహా ఇచ్చివుంటే బాగా వుండేది.

ఇంతకుముందు గొట్టిముక్కల జగన్నాథరాజు గారు పబ్లిక్ వర్క్సు మంత్రిపై గోదావరి జలాల పంపిణీవిషయమై కొన్ని ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను ఆయన అదివరకు పార్టీ సమావేశంలో చేయడం, వాటికి మంత్రి జవాబు చెప్పడం జరిగింది. జగన్నాథరాజు గారు ఏవో ఆరోపించడం, మంత్రి వాటిని కాదనడం జరిగింది. శాసనసభ్యులతో కూడిన ఒక సంఘం వేసి ఈ ఆరోపణలగురించి విచారణ చేయిస్తారా అని సుబ్బారెడ్డి, లచ్చన్న గారలు చేసిన సూచనకు, మంత్రిగారు సంఘం వేయడానికి అంగీకరించలేదు. అంగీకరించివుంటే ప్రజల్లో కలిగిన సందేహాలు తొలగేవి. (6-3-61)



హోముశాఖ మంత్రి, వృద్ధపంచాస్యమ్ము
రాజకీయశాస్త్రరంగవేత్త
యినుపమాసి దిట్ట మనసంతు మరణించె
కూలిపోయె నెహ్రూ కుడిభుజమ్ము

—శివారెడ్డి.

## కృష్ణరాయబారం

ఆంధ్ర శాసనసభ కాంగ్రెస్ పార్టీలోని విభేదాల పరిష్కారానికి కేంద్ర వుపమంత్రి శ్రీ కృష్ణప్ప హైదరాబాదులో వుభయవర్గాలతో సంప్రదింపులు సాగిస్తున్నట్లు దినపత్రికల వార్తల వల్ల తెలుస్తున్నది. కృష్ణప్ప హైకమాండు పనుపున వచ్చారో, లేక ఏ హోదాలో వచ్చారో తెలియదు. ఇప్పటి సూచనలనుబట్టి వీరి రాయబారంగూడా కృష్ణరాయబారమే కాగలదేమోనని పరిశీలకులు భావిస్తున్నారు.

## జమీన్ రైతు

### ఉగాది సంచిక

17 తేది వెలువడుతుంది

ముఖ పత్రం:

విశ్వకవి టాగూరు వర్ణచిత్రం

కొందరు రచయితలు:

డాక్టరు బెజవాడ గోపాలరెడ్డి, పిలకల రంగారెడ్డి, శ్రీమతి కె. లక్ష్మీ రఘురాం, కుమారి డి. సి. సరస్వతి, డాక్టరు బి. రామరాజు...

కొందరు కవులు

ఆచార్య రాయప్రోలు సుబ్బారావు, షేక్ దావూద్, కొత్త సత్యనారాయణచౌదరి, మోచర్ల రామకృష్ణయ్య, మాదిరాజు రంగారావు?? 

ఫోను : 280.

గ్రామ్సు : నిర్మల.

— నిర్మల —

కాఫీపొడి :: వక్క పొడి

అన్ని షాపులలో దొరకును

వ్యాపారస్తులకు మంచి కమిషన్

నిర్మల కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు - నెల్లూరు

